క్లుప్తంగా

'చంద్రముఖి సూపర్ 6 ఫ్లాప్' ఆవిష్కరణ



తెనాలి: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ ప్రచార కార్యక్రమంపై సోమవారం సాయంత్రం నిర్వహించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ సమావేశంలో 'చంద్రముఖి సూపర్ 6 ఫ్లాప్' డీజే మిక్స్ ఆడియో గీతం సీడీ ఆవిష్కరణ ప్రత్యేకతను సంతరించుకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా ఈ ఆడియో సీడీని ఆవిష్కరించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోను, హామీ బాండ్లను ప్రస్తావిస్తూ వాటిని నెరవేర్చని వైనంపై వ్యంగ్య రీతిలో రాసిన గీతమిది.హాజరైన పార్టీనేతలు, కార్యకర్తలకు ఆడియోగీతాన్ని వినిపించారు. నాలాది బుజ్జిబాబు, కనపర్తి ప్రకాష్, జ్యోతుల సుధీర్, వంపుగ్ల కృష్ణబాబు ఈ ఆడియో సీడీని రూపొందించారు. జిల్లా అధ్యక్షుడు రాంబాబు వీరిని శాలువాతో సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్యశిబిరం

రెండురోజులపాటు నిర్వహణ



తెనాలి: పట్టణ ప్రముఖుడు ఈదర రామారావు పదో వర్ధంతి సందర్భంగా ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, అయితానగర్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ సహకారంతో రెండురోజుల ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. స్థానిక మారిస్‌పేటలోని చెంచు రామానాయుడు హైస్కూల్‌లో ఏర్పాటైన శిబిరంలో అక్కడ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేశారు. మంగళవారం కూడా శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ బృందంతోపాటు ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర వెంకట పూర్ణ చంద్, ఈదర శ్రీనివాస రావు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, నల్లూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి వెంకటనారాయణ, కన్నెగంటి మురళీకృష్ణ, గుమ్మడి ప్రసాద్, మునిపల్లి దుర్గాప్రసాద్, హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పటాన్ కరిముల్లా, అధ్యాపకుడు వెంకట్ పర్యవేక్షించారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించండి



తెనాలిఅర్బన్: సొంత ఇంటి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని ఇప్పించే విధంగా చూడాలని పట్టణవాసి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కవిరాజాపార్కులో చెట్టు కొట్టివేయాలని, సర్వే నిర్వహించాలని, 20వ వార్డులో పొల్యూషన్ వలన ఇబ్బందులు పడుతున్నామని పలువురు అర్జీలు అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏసీపీ శివన్నారాయణ, డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసులు, శ్రీనివాసరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



తూములూరు(కొల్లిపర): ఇసుక లారీ, హోలీ క్రాస్ ప్రవేటు స్కూల్ వ్యాన్ ఢీ కొట్టుకున్న ఘటన కొల్లిపర మండల పరిధిలోని తూములూరు గ్రామంలో పాత గ్రంధాలయం వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం కొల్లిపర గ్రామంలోని హోలీ క్రాస్ స్కూల్ వ్యాన్ పాఠశాల ముగించుకుని విద్యార్థులను వారి ఇంటి వద్ద దించటానికి వస్తున్న క్రమంలో తూములూరు గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి సర్వేస్ రోడ్డు దిగే క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ప్రమాదవశాత్తు స్కూల్ వ్యానుకు చివరి భాగంలో లారీ తగలటంతో స్థానికులు, వ్యాన్‌లో విద్యార్థులు ఒక్క సారిగా భయాందోళనకు గురైనారు. లారీ, వ్యాన్ ఆపి పరిశీలించగా వ్యాన్ లోని 15 మంది విద్యార్థులకు ఎటు వంటి గాయాలు అవ్వక పోవటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే పోన్ ద్వారా స్థానిక ఎస్ఐ కోటేశ్వరరావుకు విషయం తెలియ జేయగా ఆయన సంఘటన స్థలాన్ని పరిశీలించి పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి లారీని స్వాధీన పరుచుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి కమిటీ జాడెక్కడా?

- జిల్లా వైద్యశాలలో ఏడాదిగా ఇదే తీరు...
- పరిష్కారం కాని సమస్యలు
- నర్సింగ్ సిబ్బంది కొరత
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



తెనాలి జిల్లా వైద్యశాల



ఓపీ రాయించుకుంటున్న రోగులు



ఖాళీగా ఉన్న జిల్లా అభివృద్ధి కమిటీ బోర్డు

తెనాలిఅర్బన్: స్థానిక జిల్లా వైద్యశాలలోని అభివృద్ధి కమిటీ లేకపోవటం వల్ల ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేస్తున్నాయి. వాటికి సరైన పరిష్కారం దొరకకపోవటంతో స్థానిక అధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అటు అధికారులు, ఇటు సిబ్బంది ఎప్పుడు ఏ సమస్య వచ్చి పడుతుందనే ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. తెనాలి జిల్లా వైద్యశాలకు గుంటూరు తర్వాత అతి పెద్ద వైద్యశాలగా పేరున్నది. జిల్లా వైద్యశాల 200 పడకలతో, ఆదే ఆవరణలో ఉన్న తల్లీపిల్లల వైద్యశాల100 పడకలతో ఉంది. ఇవి కాకుండా నూతనంగా 100 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌ను నిర్మిస్తున్నారు. అంటే తెనాలి జిల్లా వైద్యశాల ఆవరణలో మూడు ఆస్పత్రులు ఉన్నట్లు చెప్పవచ్చు. తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తెనాలి, రేపల్లె, వేమూరు, మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కృష్ణ జిల్లాలోని పలు ప్రాంతాల పేద ప్రజలు ఇక్కడకు వచ్చి వైద్య సేవలు పొందుతుంటారు. తెనాలి జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలో ఒక్కోసారి సుమారు 320 మంది ఇన్‌పేషెంట్‌లు ఉంటుంటారు. అంటే వీటి సేవలను ఏ స్థాయిలో పేద ప్రజలు ఉపయోగించుకుంటున్నారో మనకు అర్థమౌతుంది.

ఏడాది దాటినా జరగని నూతన కమిటీ

ప్రభుత్వ వైద్యశాలలోని పాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేస్తువస్తోంది. మొదట్లో తెనాలి వైద్యశాలకు స్థానిక శాసన సభ్యులు చైర్మన్‌గా వ్యవహరించే వారు. తర్వాత కాలంలో పాలకులు జిల్లా పరిషత్ చైర్మన్‌ను చైర్మన్‌గా కొన్ని సంవత్సరాలు నియమించారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా స్థానిక శాసన సభ్యులు నియమించిన వ్యక్తిని కో చైర్మన్‌గా, వైద్యశాల సూపరింటెండెంట్ కన్వీనర్‌గా, పలువురు సామాజిక కార్యకర్తలు, దాతలు, వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా అధికారులు, జిల్లా కో-ఆర్డినేటర్, ఏపీఎంఎస్‌డీసీ ఈఈ, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు న భ్యులుగా ఏర్పాటు చేశారు. కమిటీ ఏడాదికి కనీసం మూడుసార్లు సమావేశాలు నిర్వహించి ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించే వారు. ఇలాంటి కమిటీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసింది. కానీ ఇప్పటి వరకు నూతన కమిటీని నియమించలేదు. దీంతో వైద్యశాలలో సమస్యల పరిష్కారం కరువైందనే చెప్పవచ్చు.

వేధిస్తున్న నర్సింగ్ సిబ్బంది కొరత

తెనాలి జిల్లా వైద్యశాలలో 48 స్టాఫ్ నర్సుల పోస్టులు ఉన్నాయి. వీటిలో 42 మంది మాత్రమే గతేడాది వరకు పనిచేస్తు వచ్చారు. మిగిలిన ఆరు పోస్టులు ఖాళీగా ఉంటూ వచ్చాయి. గత నెలలో జరిగిన సాధారణ బదిలీలలో తెనాలి నుంచి వివిధ వైద్యశాలలకు 16 మంది స్టాఫ్ నర్సులు బదిలీపై వెళ్ళారు. తెనాలికి మాత్రం11 మంది మాత్రమే వచ్చారు. దీంతో గతంలో ఉన్న ఆరు పోస్టులతో పాటు బదిలీల వల్ల ఖాళీ అయిన అయిదు పోస్టులను కలిపితే మొత్తం 11 పోస్టులు నేటికి ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉంటే తల్లిపిల్లల వైద్యశాలను నిర్మించి పదేళ్లు దాటినా నేటికి దానికి ప్రత్యేక సిబ్బంది నియామకం జరగలేదు. చేసేది లేక అధికారులు నేషనల్ హెల్త్ మిషన్ కింద మంజూరైన వైద్యులు, సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటూ వచ్చారు. ఆ ప్రోగ్రామ్ కాలపరిమితి ముగియటంతో 35 మంది స్టాఫ్ నర్సులను గతేడాది విధుల నుంచి తొలగించారు. దీంతో వైద్యశాలల్లో స్టాఫ్ నర్సుల కొరత ఎక్కువగా ఉందనే చెప్పవచ్చు. ఇదిఇలా ఉంటే ప్రస్తుతం వైద్యులు పోస్టులు కూడ ఏడు ఖాళీగా ఉన్నాయి. అలాగే అటెండర్-1, అపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌లు-2, డీఈవో-1, సినియర్ అసిస్టెంట్‌లు-2, ఆఫీసు సూపరింటెండెంట్-1, జూనియర్ అసిస్టెంట్-1 నేటికి ఖాళీగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న పోస్టులను జిల్లా అధికారులు అవుట్ సోర్సింగ్ పద్ధతిపై ఎప్పుడైనా నియమించుకోవచ్చనే ఆదేశాలను ఇచ్చింది. దీంతో జిల్లా అధికారులు ఖాళీల భర్తీని ఎప్పటికప్పుడు చేస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఆదేశాలను నిలిపివేసింది. దీంతో ఎన్నిసార్లు స్థానిక అధికారులు సిబ్బంది నియామకం చేయాలని లిఖిత పూర్వకంగా కోరిన జిల్లా అధికారులు స్పందించటం లేదనే మాట విన్పిస్తోంది. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయటంతో పాటు జిల్లా వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరాం



తెనాలి జిల్లా వైద్యశాలలో నర్సింగ్ సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల విధుల నిర్వహణ కొంత కష్టసాధ్యంగా మారింది. పోస్టులు భర్తీ చేయాలని ఉన్నతాధికారులను కోరాం. స్పందించిన అధికారులు నలుగురు స్టాఫ్ నర్సులను డిప్యూటేషన్‌పై తెనాలి పంపారు. వారిలో ఇద్దరు ఇప్పటికే విధులలో చేరారు. మిగిలిన వారు చేరాల్సి ఉంది. అలాగే మిగిలిన పోస్టులు కూడా భర్తీ చేయాలని ఉన్నతాధికారులను లిఖిత పూర్వకంగా కోరాం.

– డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, తెనాలి.

మొక్కలు మానవ జీవితానికి ప్రాణాధారం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, వీఆర్వో సుష్మా

వల్లభాపురం (కొల్లిపర): మానవ జీవితానికి, ఇతర జీవులకు ప్రాణాధారంగా మొక్కలు ఎంతోగానో పోషిస్తున్నాయి అని అటువంటి మొక్కలను ప్రతి మనిషి సంవత్సరానికి ఒక్కసారైన ఒక మొక్క నాటి వాటి పూర్తి సంరక్షణ భాధ్యతలు తీసుకువాలని వీఆర్వో అల్లా సుష్మా అన్నారు.మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని హైస్కూలు ఆవరణలో విజ్ఞాన్ యూనివర్సిటీ వ్యవసాయ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కల నాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఆ గ్రామ వీఆర్వో సుష్మా పాల్గొన్ని హైస్కూలు విద్యార్థులకు మొక్కలు పెంచటం వలన కలుగు ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు పెంచటం వలన రానున్న భవిష్యత్ తరాలకు హరిత వారసత్వాన్ని అందించటం జరుగుతుందని తద్వారా ప్రతి వ్యక్తి పూర్తి ఆరోగ్యవంతులుగా జీవిస్తారన్నారు. నేడు వన మహోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్ యూనివర్సిటీ, వ్యవసాయ విభాగానికి చెందిన విద్యార్థులు సామాజిక బాధ్యతను చాటుతూ మొక్కల నాటింపు కార్యక్రమం చేపట్టం ఎంతో విశేషమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థులు తేజస్వి, పద్మిని, నవ్య, గాయత్రి, శ్రావంతి, తనుశ్రీ, వరలక్ష్మి, కావ్య, సోనాలీ తదితరులు పాల్గొన్నారు.

రేపటి సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలి



మాట్లాడుతున్న కేబీప్రసాద్

తెనాలిఅర్బన్: విద్యుత్ రంగంలో ప్రభుత్వాలు తేస్తున్న సంస్కరణలను వ్యతిరేకిస్తూ బుధవారం జరగనున్న సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొనాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ తెనాలి గౌరవాధ్యక్షుడు కెబీ ప్రసాద్ పిలుపునిచ్చారు. యుఈఈయు తెనాలి శాఖ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో రాష్ట్రంలోని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్‌తో చేసుకున్న ఒప్పందం మేరకు విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు జరగాయని తెలిపారు. అప్పటివరకు ఉన్న ఏపీఎస్ఈబీని రద్దు చేసి దాని స్థానంలో పవర్ జనరేషన్ కార్పొరేషన్, పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ అనే నాలుగు డిస్ట్రిబ్యూషన్ కమిటీలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి కోనసీమ, స్పెక్ట్రమ్, జీవీకె, బీపీఎల్ కంపెనీలకు ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. ఇలా చేయడం వలన విద్యుత్ వాడుకోకపోయినా ఆ కంపెనీలకు సంవత్సరానికి రూ.1200 కోట్లు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అప్పటి ప్రభుత్వం ఆ కంపెనీలతో చేసుకున్న దుర్మార్గమైన ఒప్పందం వలన విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం పడుతుందని ఆరోపించారు. వీటన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాజేష్, నాగరాజు, రోహిణి, కుమార్, శివనాగేశ్వరరావు, జానీ, తదితరులు పాల్గొన్నారు.

బకాయిల విడుదలపై ఏఐఎస్ఎఫ్ నిరసన



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం దేవిచౌక్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.6,400 కోట్లు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇస్తామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటిని ఇప్పటి వరకు వాటిని చెల్లించకపోవడం బాధకరమన్నారు. దీనివలన విద్యార్థులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. ఫీజులు చెల్లింకపోవడం వలన కళాశాలలో సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని ఆరోపించారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 11న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నా చేయడం జరుగుతుందన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు తేజ, ప్రదీప్, యశ్వంత్, పవన్, పోట్లు, నవీన్, సాయి, వివేక్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పాల్ హారీస్ పురస్కార ప్రదాన సభ



సాంబశివరావు (శ్యామ్)ను సత్కరిస్తున్న బాలకోటిరెడ్డి

- కళలు, కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం
- మనిషి ఉన్నంతలో తోటి మనిషికి సహాయ పడాలి
- బీజీఆర్ మైన్స్ డైరెక్టర్ వీసీరెడ్డి బాలకోటిరెడ్డి

తెనాలిటౌన్: ప్రతి మనిషి ఉన్నంతలో తోటి మనిషికి సహాయ పడాలని బీజీఆర్ మైన్స్ డైరెక్టర్ వీసీ రెడ్డి బాలకోటిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రోటరీ కళా పరిషత్ తెనాలి, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ద్వితీయ ఆహ్వాన పోటీలు ముగింపు సభలో రోటరీ వ్యవస్థాపకులు పాల్ హారీస్ పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన పాటిబండ్ల సాంబశివరావు (శ్యామ్)కు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా బీజీఆర్ మైన్స్ డైరెక్టర్ వీసీరెడ్డి బాలకోటిరెడ్డి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, పాల్గొని సాంబశివరావును దుశాలువా, గజమాలతో సత్కరించి పాల్ హారీస్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. లెక్చరర్‌గా, వ్యాపారవేత్తగా రోటరీలో సమర్థవంతమైన సేవలందిస్తూ అనేక అవార్డులు సాధించిన పాటిబండ్ల సాంబశివరావు సేవలు అభినందనీయమని, సమాజానికి ఆదర్శవంతమైనవని వక్తలు కొనియాడారు. ఆయన సేవాస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రోటరీలో ఆయన చేస్తున్న సేవలను వివరించారు. రోటరీ పాస్ట్ గవర్నర్ అందె రత్న ప్రభాకర్, రోటరీ క్లబ్ తెనాలి అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, డాక్టర్ జీవనలత, పలువురు రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మ డీ ఫలితాల్లో ఏఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

తెనాలిఅర్బన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన ఫార్మ డీ ఫలితాల్లో తెనాలిలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఫార్మసీ కళాశాల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కంచర్లపల్లి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల్లో రెండో సంవత్సరం విద్యార్థిని జె.రాజకుమారి, మూడోవ సంవత్సరం విద్యార్థులు డి.శ్రీచక్రి, బి.ఏస్తేరు, నాల్గోవ సంవత్సరం విద్యార్థిని ఐ.నీలమ్మ, ఐదోవ సంవత్సరం విద్యార్థి పి.భగవత్ అత్యుత్తమ మార్కులు సాధించినట్లు చెప్పారు. వీరిని ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న నాగవేణి

తెనాలిఅర్బన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్యాడిసన్‌పేటలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, 32వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణిలు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్‌ను ఏర్పాటు చేసి ఎస్సీ వర్గీకరణ సాధనకు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన పోరాట ఫలితంగా రాష్ట్రంలో ఏబీసీడీల వర్గీకరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో అత్తోట శ్యామ్, మట్లపూడి రాజేశ్వరరావు, లంక వంశీ, ప్రతాప్, కమలాకర్, వెంకటేశ్వర్లు, అత్తోట చంటి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్ దుబాయ్‌బాబు

తెనాలిఅర్బన్: పట్టణంలో జరిగే రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనుల్లో న్యాణత ప్రమాణాలను అందరూ పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 22వ వార్డులో సోమ వారం జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. కాల్వల్లోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. చెత్త సేకరణ నూరు శాతం జరిగే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, ఆరోగ్యాధికారి డాక్టర్ మువ్వా యేసుబాబు, టీపీవో సాంబశివరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

తాడేపల్లి రూరల్: దేశవ్యాప్తంగా ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అఖిల పక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం తాడేపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో తాడేపల్లి పట్టణంలోని అన్ని రంగాల సంస్థల కార్మికులు పాల్గొనాలని నేతలు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుల వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, విజయబాబు, ఐఎన్‌టీయూసీ నాయకులు దర్శన సామేలు, వైఎస్సార్‌టీయూ నాయకులు శ్రీనివాసరావు, ఏసీసీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, వేముల వెంకటేశ్వరరావు, శివ పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు తాడేపల్లిలోని ప్రాతూరు, చిర్రావూరు, వడ్డేశ్వరం, కొలనుకొండ సచివాలయాల అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పల్లెకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, నాయకులు చౌక్కా మరియదాసు, బండ్ల హనుమంతరావు, రవికుమార్, మారయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో గందరగోళం

తాడికొండ: రాజధాని కోసం రెండో విడత ప్రభుత్వ పూలింగ్ ప్రకటనతో రైతాంగం గందరగోళంలో పడిందని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు. పెదపరిమి, వడ్లమాను, హరిశ్చంద్రపురం గ్రామాల్లో సీపీఎం బృందం సోమవారం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి విడత భూ సమీకరణలో భాగంగా రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు అభివృద్ధి చేసిన అనంతరం రెండో దశ భూ ససమీకరణ గురించి ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. పది సంవత్సరాలకు పైగా గడిచినా రాజధాని ప్రాంతంలో కొందరు రైతుల ప్లాట్లు ఎక్కడున్నాయో అర్థంకాని అయోమయ పరిస్థితి నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు జొన్నకూటి నవీన్ ప్రకాష్, పేరం బాబూరావు, కుంభా ఆంజనేయులు, షేక్ జాని, దాసరి గణేష్, ఎం. అంకమ్మరావు పాల్గొన్నారు.